సాక్షి
బాపట్ల

శుక్రవారం । 25 । జులై । 2025



అమ్మవారికి జలాభిషేకం

గురజాలరూరల్: ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ గంగవరంలోని చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు గురువారం జలాభిషేకం చేశారు.



నాభిశిలకు విశేష పూజలు

శావల్యాపురం: ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా శావల్యాపురం పెదకాపు వీధిలో వేంచేసియున్న శీతల పరమేశ్వరి అమ్మవారు (నాభిశిల)కి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంగానమ్మ తల్లికి ఆషాఢ సారె

గుండవరం(చేబ్రోలు): మండలంలోని గుండవరంలో గురువారం గ్రామదేవత గంగానమ్మకు ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా గ్రామస్తులు పూజలు చేసి, సారెను సమర్పించారు.

న్యూస్‌రీల్

పొగాకు కొనుగోలుకు కృషి చేయండి



చినగంజాం: పొగాకు కొనుగోలు సజావుగా సాగే విధంగా కృషి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న సూచించారు. చినగంజాంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గురువారం పరిశీలించారు. పొగాకు కొనుగోలు ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలు, తేమశాతం పరిశీలించి కొనుగోలు జరిగేలా చూడాలని సూచించారు. పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు మార్కెట్ గోడౌను ప్రాంతంలో అధికారులు చిల్లచెట్లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంజనేయుడికి శాకంబరి అలంకారం



నరసరావుపేట: పాలపాడు రోడ్డులోని శ్రీ చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా స్వామివారిని అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి అలంకారం చేశారు. కదలిఫలం, అరటిపండ్లతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యోగా పోటీలకు మద్దిరాల జేఎన్‌వీ సన్నాహాలు

ఈనెల 29 నుంచి ప్రారంభం

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: ఈనెల 29వ తేదీ నుంచి దక్షిణ భారతస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఏటా జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ పోటీలకు తమ విద్యాలయం వేదిక కానుందని తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని జేఎన్‌వీ విద్యార్థులకు అండర్-14, అండర్-17, అండర్ -19 విభాగాల్లో ఈ పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. 29,30,31 తేదీల్లో మూడు రోజులు జరిగే పోటీలకు సౌత్ జోన్ పరిధిలోని ఆయా విద్యాలయాల నుంచి సుమారు 340 మంది విద్యార్థులు ఈ యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఆగస్టులో జేఎన్‌వీల పరిధిలో జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కానున్నట్లు చెప్పారు.

వైభవంగా తిరుప్పావడ సేవ



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డు సమీపంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గురు పుష్యమి పర్వదినంగా సందర్భంగా తిరుప్పావడ సేవను వైభవంగా నిర్వహించారు. పులిహోర, రుచికరమైన ఆహార పదార్థాలతో అలంకరించిన స్వామి రూపాన్ని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఏర్పాట్లను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

రూ.7 లక్షల విలువైన బంగారం చోరీ

వినుకొండ: తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లిన ఓ మహిళ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన వినుకొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న సన్నెగంటి విజయలక్ష్మి పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటోంది. భర్త మృతిచెందడం, పిల్లలు దూర ప్రాంతంలో ఉండడంతో ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో ఇంటికి తాళం వేసి ఈనెల 17వ తేదీన బంధువులతో కలిసి షిరిడీ వెళ్లింది. యాత్రనుంచి గురువారం ఇంటికి వచ్చి చూసిన ఆమెకు బీరువాలోని రూ.7లక్షల విలువైన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో, చోరీ జరిగి నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పయ్యావుల సారూ.. పైసలివ్వరూ?

- బ్లాక్ బర్లీ పొగాకుకు నో పేమెంట్
- ఇప్పటివరకూ కొన్నది 3,700 టన్నులు
- 2050 మంది రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.33 కోట్లు
- 40 రోజులు దాటుతున్న పైసా ఇవ్వని సర్కార్
- పొగాకు డబ్బులకోసం రైతుల ఎదురు చూపులు



జె.పంగులూరులోని కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్లు తూకం వేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రైతులు పండించిన బ్లాక్ బర్లీ పొగాకు కొంటామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి సర్కార్ మొక్కుబడిగా కొన్న పొగాకుకూ డబ్బులు చెల్లించక మొండికేసింది. పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకూ 3,700 టన్నుల పొగాకు మాత్రమే కొన్న ప్రభుత్వం 40 రోజులు దాటినా రైతుల ఖాతాల్లో ఒక్క పైసా జమచేయలేదు. 2050 మంది రైతులకు సంబంధించి రూ.33 కోట్లు చెల్లించాల్సి ఉంది. పొగాకు కొన్న మార్క్‌ఫెడ్ అధికారులు ప్రభుత్వం డబ్బులు వేస్తుందని చెప్పి తప్పించుకుంటున్నారు. ఇన్నాళ్లు అప్పులు తెచ్చి ఎకరాకు రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి పెట్టిన రైతులు పొగాకు కొనుగోలు చేసిన ప్రభుత్వం డబ్బులివ్వకపోవడంతో కూలీలకు కూడా డబ్బులు చెల్లించలేని స్థితిలో లబోదిబోమంటున్నారు. పొగాకు కొనడమే భాగ్యమని, డబ్బులు ప్రభుత్వం ఇచ్చినప్పుడు తీసుకోవాలే తప్ప ఎలా అడుగుతారని పచ్చనేతలు కన్నెర్ర చేస్తున్నారు. దీంతో పేద రైతులు భయపడి పొగాకు డబ్బుల విషయంపై నోరు మెదపలేక మిన్నకుండి పోతున్నారు. ప్రభుత్వం మాత్రం డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పడంలేదు. శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పర్చూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇంకొల్లు మండలం ఇడుపులపాడులో కొత్తగా పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారు. కనీసం ఆర్థిక మంత్రి అయినా కరుణించి పొగాకు డబ్బులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలులో వివక్ష

మరోవైపు పొగాకు కొనుగోళ్లలో వివక్ష కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి. కూటమి పార్టీల నేతలు చెప్పిన రైతుల పొగాకు మాత్రమే అధికారులు కొంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులన్న సాకుచూపి చాలామంది రైతుల పొగాకును కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై కొందరు రైతులు అధికారులను అడిగితే టీడీపీ నాయకులు చెబితేనే కొంటామని చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఒకవైపు గత ఎన్నికల్లో ఓట్లేయలేదన్న అక్కసుతో కొందరి రైతుల పొగాకును కొనుగోలు చేయక పోగా కొన్న రైతులకూ ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వివక్ష చూపక అందరి రైతుల పొగాకు కొనుగోలు చేయడంతోపాటు సకాలంలో డబ్బులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

మొక్కుబడి కొనుగోళ్లతో సరి

పండించిన పొగాకును టొబాకో కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో బాపట్ల జిల్లాలోని పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన రైతు ఉప్పుటూరు సాంబశివరావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకోగా కొందరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ పరిస్థితిలో పొగాకును కంపెనీల ద్వారా కొనిపించడమా? లేక ప్రభుత్వమే టొబాకో బోర్డు లేదా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడమో చేయాలని ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో పర్చూరులో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొంటామని ప్రకటించిన ప్రభుత్వం జూన్ 19వ తేదీన పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అరకొరగా పొగాకు కొంటోంది. ఇప్పటివరకూ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలు పెట్టి 3,700 టన్నులు మాత్రమే కొంది. వాస్తవానికి ఇంకా రైతుల వద్ద 50 వేల మెట్రిక్ టన్నులకు పైగా పొగాకు ఉండగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా 14 వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఈ లెక్కన ప్రభుత్వం ఇంకా 11 వేల టన్నులు మాత్రమే కొననుంది. దీంతో మిగిలిన పొగాకు ఎవరుకొంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు.



ఎస్టీ కుటుంబాలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

పీ4 పథకంతో పేదలకు చేయూత

చెరుకుపల్లి గ్రామసభలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి

రేపల్లె: సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీరో పావర్టీ పీ-4 పథకం ద్వారా పేదలకు చేయూతనిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జీరో పావర్టీ - పీ-4 పథకంలో భాగంగా చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపేదలను గుర్తించి వారి కనీస అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం పీ-4 పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి గ్రామంలో ఆర్థికంగా స్థిరపడిన వారి నుంచి ఆ గ్రామంలోని నిరుపేదలను ఎంపిక చేసి చేయూతనివ్వటం జరుగుతుందన్నారు. చెరుకుపల్లిలోని 10 ఎస్టీ కుటుంబాలను పీ-4 సర్వే ద్వారా ఎంపిక చేసి ఆదుకునేందుకు దత్తత తీసుకున్నామన్నారు. 10 ఎస్టీ కుటుంబాల స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసుకునేందుకు జాబ్‌కార్డులు కావాలని, పక్కా గృహాలు నిర్మించి అందించాలని, స్వయం ఉపాధి పొందేందుకు మార్గాలు చూపించాలని పలు కుటుంబాల సభ్యులు కలెక్టర్‌తో చెప్పారు. స్పందించిన అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, పక్కా గృహాలను కేటాయించాలని, అర్హులైన యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు వారి ఆసక్తి మేరకు బ్యాంకుల నుంచి రుణాలు కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంపన్నుల కుటుంబాల నుంచి అందే సాయంతో పాటు వ్యక్తిగతంగా సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. యానాదుల యూత్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు చౌటూరి రమేష్ జిల్లా కలెక్టర్ వెంకట మురళికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ నేలపు రామలక్ష్మి, సీపీవో ఏఎస్ రాజు, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

బాపట్ల: మడ అడవుల దినోత్సవాన్ని జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మడ అడవుల దినోత్సవం నిర్వహణపై మొక్కలు నాటే ప్రాంతాలను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. సూర్యలంక తీర ప్రాంతం, నగర వనాన్ని ఆయన పరిశీలించారు. మడ అడవుల దినోత్సవానికి బాపట్ల సూర్యలంకకు ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె పవన్ కల్యాణ్ జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెప్పారు. మడ అడవులు వృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. సూర్యలంకలోని అటవిశాఖకు చెందిన నగరవనం, సూర్యలంక తీర ప్రాంతంలోని అటవీ భూములను కలెక్టర్ పరిశీలించారు. మడ అడవులు పెరగడం ద్వారా ప్రకృతి విపత్తుల మంచి తీవ్రమైన నష్టం జరగకుండా అరికట్టగలమన్నారు. వాటి ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మంత్రి పర్యటన జయప్రదం చేసేందుకు అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్‌కుమార్, డీపీఓ ప్రభాకర్ డ్వామా పీడీ విజయలక్ష్మి, బాపట్ల ఆర్డీవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న ఇసుక దందా



ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న అక్రమార్కులు

- 'పరోట' నేతృత్వాన మండలంలో జోరుగా ఇసుక తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- అందరి చూపు ఈ వ్యాపారం పైనే..

చీరాలటౌన్: ప్రకృతి వనరులు తరలిపోతున్నాయి. కూటమి నేతృత్వంలో అవినీతి తారస్థాయికి చేరుతోంది. ఇసుక కోసం గబ్బర్‌సింగుల్లా మారిన అక్రమార్కుల దెబ్బకు నేల తల్లి విలవిల్లాడిపోతోంది. అధికార పార్టీ ముఖ్యనేత అండదండలతో ఇసుక దందాతో పేట్రేగిపోతున్నారు. స్థానిక పోలీసు, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు దొరికినంత జేబుల్లో వేసుకుని అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారు. ప్రధానంగా చీరాల మండలంలోని సముద్ర తీర ప్రాంతంతో పాటు ఆటోనగర్ సమీపంలో, 216 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములు, ఈపూరుపాలెం, విజయనగర్‌కాలనీ, సావరపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, పాతచీరాల తదితర ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను ఇబ్బడిముబ్బడిగా కొల్లగొడుతున్నారు. రోజుకు 150 ట్రాక్టర్లు, టైరు బండ్ల ద్వారా ఇసుక తరలిస్తూ లక్షలు వెనుకేసుకుంటున్నారు. ఈపురుపాలెం, బోయినవారిపాలెం, ఆటోనగర్ సమీపంలో ఈపురుపాలెంకు చెందిన 'పరోట' ఇసుకను అక్రమంగా 24 గంటలపాటుగా ఇబ్బడిముబ్బడిగా అమ్మకాలు చేస్తున్నాడు. శివారు కాలనీలు, ప్రధాన రోడ్డుపై వెళితే చాలు ఎక్కడ చూసినా ఇసుక తరలిస్తున్న టాక్టర్లు, టైరుబండ్లు కనిపిస్తూనే ఉన్నాయి. చీరాల పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమార్కులకు కల్పవృక్షంగా మారింది. గతంలో గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి సమయంలో టైరుబండ్లలో ఇసుక తరలించే వారు. కానీ నేడు వారి ఇష్టం వచ్చినట్లు తవ్వేసుకుంటున్నారు. టైరు బండి రూ.2వేల వరకు, ట్రాక్టర్ రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు.



ఇసుకను తవ్వడంతో చెరువులా మారిన 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతం

కొత్తవారు ఎంట్రీ...

ఇసుక అక్రమ వ్యాపారం చేస్తే అతి కొద్దిరోజుల్లోనే లక్షలు గడిస్తుండటంతో ప్రస్తుతం అందరి దృష్టి ఈ వ్యాపారంపై పడింది. చీరాల మండలంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెంతోపాటు విజయనగర్ కాలనీ, పాతచీరాల తదితర గ్రామాల్లో అధికార పార్టీ నేత అండతో పరోటా, చోటామోటా రాజకీయ నాయకులతోపాటు పలువురు ఇసుక అక్రమ వ్యాపారంలోకి దిగారు. ముఖ్యంగా ఇసుక వ్యాపారం చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే నమ్మకంతో చాలా మంది కొత్తగా ఇసుక దందాకు దిగారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించం. గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేస్తున్నాం. ఈపురుపాలెం, బోయినవారిపాలెం, పాతచీరాల, తీర ప్రాంత గ్రామాల్లో అక్రమంగా ఇసుక క్వారీలు నిర్వహించినా, అమ్మకాలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

–కుర్రా గోపీకృష్ణ: తహసీల్దార్



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 773

కొమ్ములు : 600 బస్తాలు	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,711	10,200

కాయలు : 173 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,725	10,250

మొత్తం అమ్మకాలు : 579.750 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,733
అమ్మకాలు	45,884
నిల్వ	8,071

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,300
341	10,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,500
నంబరు–5	10,000–13,500
341	10,000–13,600
4884	10,000–12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 12,600
దేవనూరు డీలక్స్	10,000 – 12,500
ఆర్మూర్	9,600 – 11,000
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,800
బాడిగ – 355	10,000–12,500
దేవనూరు డీలక్స్	10,000–12,600
తాలు	5,300 – 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

నత్తనడకన గుండ్లకమ్మ బ్రిడ్జి నిర్మాణం

- ఏడేళ్లుగా సాగుతున్న పనులు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 80 గ్రామాల ప్రజల అవస్థలు
- వర్షాకాలంలో రాకపోకలకు బ్రేక్
- బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే చీరాల– దర్శి– పొదిలికి నేరుగా బస్సు వసతి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



జమ్ములమడక సమీపంలో గుండ్లకమ్మపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

బల్లికురవ: గుండ్లకమ్మ వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. దీంతో ఇటువైపు ప్రజలు అటు.. అటు వైపు ప్రజలు ఇటు వెళ్లే వీలు లేక అల్లాడిపోతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఏడేళ్లు అవుతున్నా కూటమి సర్కారు దానిని పూర్తి చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో వాహనచోదకులు, ప్రజలకు అవస్థలు తప్పటంలేదు. 2018లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బల్లికురవ మండలం వెలమవారిపాలెం పంచాయతీలోని కె.జమ్ములమడక కాలనీ సమీపంలో గుండ్లకమ్మను దాటేందుకు సీఆర్ఎఫ్‌లో రెండు లేయర్ల బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పిల్లర్లు, బీములు వేయడానికి 5 సంవత్సరాలు పట్టింది. రెండేళ్లుగా పనుల ఊసేలేదు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, దర్శి మండలాల్లోని 80 గ్రామాలకు కనెక్టివిటీతో రాకపోకలకు ఇబ్బందులు తొలుగుతాయి.

చుట్టూ తిరగాల్సిందే..

వంతెన పూర్తి కాని పరిస్థితుల్లో.. నాలుగు మండలాల్లోని ప్రజలు అద్దంకి మీదుగా రాకపోకలు సాగించాల్సి రావడంతో 40 నుంచి 50 కిలోమీటర్లు అదనంగా ప్రయాణిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఎండాకాలంలో మాత్రం బైక్‌లు, బాటసారులు గుండ్లకమ్మ నదిలోనే ప్రయాణించే అవకాశం ఉంది. వర్షాకాలంలో మాత్రం అది కుదరని పని.

ఉచిత ప్రయాణానికి అవకాశం

బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కారంచేడు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ముండ్లమూరు, దర్శి మండలాల్లోని 140 గ్రామాలను కలుపుతూ చీరాల, చిలకలూరిపేట డిపోల నుంచి పొదిలికి నేరుగా బస్సు వసతి కల్పించవచ్చు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉమ్మడి జిల్లాలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామంటూ ప్రకటిస్తోంది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే బస్సులో జిల్లా కేంద్రానికి నేరుగా వెళ్లవచ్చు. ప్రస్తుతం మూడు బస్సులు మారుతూ గంటల తరబడి నిరీక్షిస్తేనే గమ్యం చేరుకొనే పరిస్థితి. పిల్లర్లు, బీముల పనులు పూర్తి కాగా.. శ్లాబులేసి మార్జిన్‌లో గోడలు నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణం విషయమై ఆర్ అండ్‌బీ ఏఈ బాబ్జిని వివరణ కోరగా బిల్లుల చెల్లింపులో జాప్యంతో పనులు నిలిచాయని తెలిపారు. పనులు పూర్తి చేయించి రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తామన్నారు.

దర్శి వెళ్లాలంటే అదనపు ప్రయాణం



ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గుండ్లకమ్మ బ్రిడ్జిపై నిర్మాణం చేపట్టంతో సంతోషించాం. కానీ పనులు నత్తనడకతో పూర్తి కానందున ప్రయాణం సాగటం లేదు. ముండ్లమూరు, దర్శి వెళ్లాలంటే అద్దంకి వెళ్లాల్సిందే. 40 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది.

–గద్దల మరియబాబు, కె.జమ్ములమడక

బ్రిడ్జి పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయి



బ్రిడ్జి నిర్మాణం పూర్తికానందున రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. మండల, జిల్లా కేంద్రానికి చేరాలన్నా బస్సులు లేవు. దర్శి వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళుతున్నాం. బ్రిడ్జి పూర్తయితే చీరాల–పొదిలికి బస్సులు నడిపే అవకాశం ఉంది.

– నూనె ఏసుబాబు, కె.జమ్ముల మడక కాలనీ

పర్యాటకులకు ఇబ్బందులే



వెలమవారిపాలెం గ్రామానికి తరాలుగా జనవరి నుంచి జూన్ మధ్య ఖండాంతరాలు దాటి వైట్ స్పాట్ విదేశీ పక్షులు వచ్చి పొదిగి పిల్లలతో తిరిగి వెళుతుంటాయి. ఈ పక్షులను చూసేందుకు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి పర్యాటకులు గ్రామానికి వస్తూంటారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పర్యాటకులకు ఇబ్బందులు తొలగుతాయి.

–నూనె ప్రభుదాసు, సర్పంచ్, వెలమవారిపాలెం

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి



పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాం పేరుతో అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం ఇక్కడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి చెందిన సీనియర్ నేతలను పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే నాయకులను, కార్యకర్తలను ఏదో రకంగా ఇబ్బంది పెట్టాలని చూడటం కూటమి సర్కార్‌కు సమంజసం కాదన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిస్టలరీల ద్వారానే 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం కొనుగోలు చేసి అమ్మారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోని లిక్కర్ బ్రాండ్‌లతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లిక్కర్ షాపులను కొనసాగించిందే తప్ప కొత్తగా ఏర్పాటు చేసింది లేదని, ప్రభుత్వ దూకాణాలను ఏర్పాటు చేసి లిక్కర్ షాపుల నిర్వహణ ద్వారా ప్రభుత్వానికి విపరీతంగా ఆదాయం చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని లిక్కర్ అమ్మకాలు చేశారని ఆరోపణలు చేస్తున్న కూటమి ప్రభుత్వంలో అదే బ్రాండ్‌లు ఆరు నెలలపాటు కొనసాగించారని, ప్రభుత్వానికి చేకూరే ఆదాయం లేకపోగా బెల్టు షాపులను విపరీతంగా ప్రోత్సహించి పార్టీ నాయకులకు లాభాలు తెచ్చి పెడుతున్నారని ఆరోపించారు.

రైతుల పరిస్థితి పట్టదా?

పార్టీల ప్రాతిపదికన పొగాకు కొనుగోలు చేయడం ఎంతవరకు సమంజసమంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పొగాకు సాగు చేసిన వారిలో ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులని.. వారిలో ఎక్కువ మంది కౌలు రైతులున్నారని వారంతా పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారి పంటను కొనుగోలు చేయకపోవడం దారుణమైన విషయమన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- అందుబాటులో లేని 108 వాహనం
- ఆటోలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

వినుకొండ: అతివేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా భార్యభర్తలతో పాటు మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన వినుకొండ నరసరావుపేట రోడ్డులోని రజకకాలనీ సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరానికి చెందిన జయరాం , తన భార్య లక్ష్మి, కుమార్తెలు సంఘవి, జాహ్నవిలతో కలిసి గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా గజ్జలకొండకు కారులో వెళుతుండగా కారు ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఈక్రమంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న తలతోటి మల్లేశ్వర్జున అనే వ్యక్తిని కారు బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడితో పాటు జయరాం, లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు.

ప్రాణదాత ఎక్కడ?

ప్రమాద సమాచారం అందిన వెంటనే నిమిషాల వ్యవధిలో ఘటనా ప్రాంతానికి చేరుకోవాల్సిన 108 వాహనం ఎంతసేపటికీ ఘటనాప్రాంతానికి చేరుకోలేదు. దీంతో గత్యంతరం లేక స్థానికులు క్షతగాత్రులను ఆటోలో గుంటూరుకు తరలించారు. ఆపద సమయంలో రాలేనప్పుడు ఇక 108 వాహనం ఎందుకని బాధితుల బంధువులు ప్రశ్నించారు.

ఓటరు క్లెయిమ్‌లపై విచారణ

ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: చీరాల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు క్లెయిమ్‌లపై బీఎల్‌వోలతో సమర్థంగా విచారణ నిర్వహిస్తున్నామని ఈఆర్‌వో, ఆర్డీవో తూమాటి చంద్రశేఖరనాయుడు తెలిపారు. గురువారం చీరాల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయపార్టీల నాయకులతో ఓటరు క్లెయిమ్‌లపై విచారణ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో ఓటరు క్లెయిమ్ అర్జీలు పెండింగ్‌లో లేకుండా విచారణ చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు తమ బూత్ ఏజెంట్లతో విచారణ చేయించుకోవచ్చన్నారు. క్లెయిమ్ అర్జీని నిశితంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అవాంతరాలు లేకుండా విచారణ చేస్తున్నారని, ఏమైనా అభ్యంతరాలుంటే వివరాలను తెలియజేయాలన్నారు. ఇటీవల మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లోని ఓటర్ల పూర్తి వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం విచారణ చేయాలని, ఇష్టానుసారంగా విధులు నిర్వహించవద్దనే ఆదేశాలు జారీ చేశామన్నారు. సమస్యలను తనకు గానీ, ఏఈఆర్వోలకు గాని తెలియజేయాలని కోరారు. రాజకీయపార్టీల నాయకులకు ఉన్న పలు అనుమానాలను ఆర్డీఓ నివృత్తి చేశారు. తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీటీ సుశీల, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర నాయుడు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరం



కొండమంజులూరులో అక్రమించిన డొంక పోరంబోకు భూమి పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్

జె.పంగులూరు: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడం నేరమని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. మండల పరిధిలోని కొండమంజులూరు జాతీయ రహదారి వెంబడి గత సర్వే నెంబర్ 58లో ఆక్రమణకు గురైన డొంక పోరంబోకును ఆర్డీఓ గురువారం పరిశీలించారు. 58 సర్వే నెంబర్‌లో మొత్తం 2.47 ఎకరాలు డొంక పోరంబోకు ఉన్నట్లు అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్రమణకు గురైన డొంక పోరంబోకు స్థలాన్ని గుర్తించి, ఆక్రమించిన వారిని గుర్తించి సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం పంచాయతీ, రెవెన్యూ అధికారులు.. ఆక్రమించిన వారికి నోటీసులు పంపించి స్థలం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొండమంజులూరు గ్రామానికి ఆనుకొని ఉన్న మట్టి దిబ్బను పరిశీలించారు. అక్రమ మట్టి తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూర్పు కొప్పెరపాడులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 14 వేల టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సింగారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పెంపునకు కృషి చేయండి

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి.రవీంద్రనాథ్



ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యాపీఠం రాష్ట్ర, జిల్లా కో–ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల పెంపునకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఏపీ ఓపెన్ స్కూల్‌సొసైటీ) రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి.రవీంద్రనాథ్ సూచించారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరగాలన్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలను అందించాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం మల్లిఖార్జునరావు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 30వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు అపరాధ రుసుం రూ.200 చెల్లించి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440004297, 8522994297 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పల్నాడు జిల్లా కో–ఆర్డినేటర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగాల



జంగాల సింగరయ్య యాదవ్

దాచేపల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లికి చెందిన జంగాల సింగరయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాక వెంగళరావు యాదవ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు సింగరయ్య యాదవ్ గురువారం తెలిపారు. రానున్న రోజుల్లో బీసీలను ఏకతాటిపైకి తీసుకొస్తానని, బీసీలకు సముచిత న్యాయం జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి బీసీల అభ్యున్నతి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని, రాష్ట్రంలోని బీసీలంతా వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసి బీసీలు అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సింగరయ్య యాదవ్‌ని పలువురు అభినందించారు.

ఆరు మండలాల్లో స్వల్ప వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆరు మండలాల్లో స్వల్ప వర్షం పడింది. దుగ్గిరాల మండలంలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా 8.6 మిల్లీమీటర్లు పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 2.6 మి.మీ. పడింది.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

కనమర్లపూడి ప్రమాదంలో గాయపడిన చికిత్స పొందుతూ మహిళ మృతి



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారిపై ఈనెల 21న జరిగిన మినీ వాహనం , ఆటో ఢీకొన్న ఘటనలో మరొకరు మృతిచెందారు. ఘటనలో బత్తుల యశోదకుమారి (29) రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రగాయాలతో గుంటూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు శావల్యాపురం ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. గుంటూరులో మృతదేహానికి పంచనామా నిర్వహించి, అనంతరం బంధువులకు అప్పగించారు. ఘటనలో ఇప్పటికే నలుగురు దుర్మరణం చెందగా, యశోదకుమారి మృతితో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

ఔచిత్యం పాటించే కవిత్వం ప్రేక్షకులను రంజింప చేస్తుంది

డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

బాపట్ల: ఔచిత్యం పాటించే కవిత్వం ఏదైనా ప్రేక్షకులను, పాఠకులను రంజింప చేస్తుందని సాహితీవేత్త, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. వివేక సర్వీస్ సొసైటీ, ధృతి సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థ సంయుక్త నిర్వహణలో నెలనెల నందివర్ధనం 103వ కార్యక్రమం బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలోని వివేకా కార్యాలయంలో గురువారం జరిగింది. నా కవిత్వ తత్వం నిర్మాణం గమనం గమ్యం అనే అంశంపై సుద్దాల అశోక్ తేజ ప్రసంగించారు. పాట, సంగీతం, సాహిత్యం తన కుటుంబం నుంచి వారసత్వంగా తనకు వచ్చాయని, తండ్రి హనుమంతు నుంచి ఎన్నో మెళకువలు నేర్చుకున్నానని చెప్పారు. ఎలాంటి సాహిత్యానికైనా, కవిత్వానికైనా ఔచిత్య భంగం కలగకూడదని తాను విశ్వసిస్తానన్నారు. కవిత్వానికి పునాదిగా ఔచిత్యాన్ని క్రమం తప్పకుండా పాటించడం అనేది తనకు అలవాటు అయ్యిందని స్పష్టం చేశారు. తన సాహిత్యం యావత్తూ ప్రజలను చైతన్యం చేసే విధంగా ప్రకృతి, శ్రమ, స్త్రీ, మానవ సంబంధాలు అనే అంశాల మీద కొనసాగిందన్నారు. సాహిత్యం ప్రజల చెవిని, హృదయాన్ని రెండింటినీ తాకే విధంగా మంచి ఎత్తుగడతో ముందుకు సాగాలని తన తండ్రి చేసిన సూచన మేరకు తన కవిత్వ ప్రస్థానం కొనసాగిందన్నారు. నేలమ్మ నేలమ్మ నేలమ్మ నీకు వేల వేల వందనాలమ్మ.. అంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే కవిత్వం, ప్రతి స్త్రీలో అమ్మను, సోదరిని చూడాలనే సందేశంతో స్త్రీ ఔన్నత్యాన్ని తెలియజేసే కవిత్వం, శ్రమ శక్తి గొప్పతనాన్ని తెలియజేసే కవిత్వం, మానవ జీవన సౌందర్యాన్ని , మానవ సంబంధాల గొప్పతనాన్ని, ప్రత్యేకతను తెలియజేసే కవిత్వం తన నుంచి ప్రసవించి, ప్రసరించిందన్నారు. 'తెలుగు సినీ గేయ సాహిత్యం' అనే శీర్షికతో నెలనెల నందివర్ధనం కార్యక్రమాల ప్రసంగ పాఠాల సంచికను డాక్టర్ సుద్దాల ఆవిష్కరించారు. వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎన్‌వీ నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ధృతి అధ్యక్షులు కళ్లం హరినాధరెడ్డి, కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు



మాట్లాడుతున్న నరసింగరావు

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం వల్ల వేలాది కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర మహాసభలు రెండో రోజు శుక్రవారం పాత గుంటూరులోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూయ, రమణరావు అధ్యక్షతన జరిగాయి. నరసింగరావు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీలోపు సంక్షేమ బోర్డు పని చేయడం ప్రారంభించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 15న లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు మాట్లాడారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రమణరావు, ఆర్.వి.నరసింహారావు, కోశాధికారిగా గోపాలరావు, ఉపాధ్యక్షులుగా అనసూయ, రాజ్‌గోపాల్, సహాయ కార్యదర్శులుగా సుందరబాబు, అప్పారావు, 17మందితో కార్యదర్శివర్గాన్ని, 63 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. గుంటూరు జిల్లా నుంచి దండా లక్ష్మీనారాయణ, నార్ని నాగేశ్వరరావు నియమితులయ్యారు. డిసెంబర్‌లో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల విజయవంతానికి రాష్ట్రంలో వాడవాడలా ప్రచారం చేయాలని సభలో తీర్మానించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఉమామహేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.